# బురదలో జాబిల్లి

అడవి...

పసరు కక్కుకున్న బాలింతలా వుంది. రాత్రి వర్షం పడిందేమో... పదకొండు మంది సాయుధులు తుపాకులు భుజానేసుకుని చిత్తడిగా వున్న చెట్ల మధ్యనించి నడవలేకపోతున్నారు.

అందరివీ డేగ కళ్లే...

చీమ చిటుక్కుమన్నా గన్స్ పొజిషన్‌లోకి తీసుకునేంత అప్రమత్తంగా నడుస్తున్నారు. ముళ్ళ కంపల మధ్య చేతులూ, కాళ్లు గీరుకుపోతున్నాయి. రెండున్నర గంటల నడకలో రవ్వంత అలసట కన్పడుతోంది.

గుట్ట కొస భాగం చేరాక ఓ ప్రదేశంలో కూలబడ్డారు.

ఆ పచ్చటి అడవిని చూస్తుంటే ఆపుకోలేని ఓ వ్యక్తి తుపాకి పక్కన బెట్టి... 'ఈ అడవి మనదిరా... ఈ భూమి మనదిరా... దొర ఏందిరో... ఆని పీకుడేందిరో....' అని పాటందుకున్నాడు. మిగితావాళ్లు ముసిముసిగా నవ్వుకుంటుంటె... వాళ్ల నాయకుడు సిగరెట్ వెలిగించాడు.

ఆ పాట గాలి తరంగాల్లో కల్సి గొర్రెలు మేపుతున్న పన్నెండేళ్ల సమ్మిగాడి చెవిలో

పడింది. వాడికి తెల్సు ఆపాట భాస్కరన్ననే అంతబాగా పాడతాడని. గొర్రెల్ని ఓసారి అదిలించి చెట్ల మధ్యల్లోంచి పరుగుపరుగున వచ్చాడు వాళ్ల దగ్గరికి. రాగానే వాళ్లని చూసి ఎగపోస్తూ అక్కడే ఆగిపోయాడు. సిగరెట్ తాగుతున్న పెద్దమనిషి "రా... తమ్మీ" అన్నాడు ఆప్యాయంగా. సమ్మిగాడికి ధైర్యం వచ్చింది.

"మీరెవలు ? నేను కొమురన్న దళం అనుకున్న" అన్నాడు వాడు. పాట పాడింది ఎవరా అన్నంత విచిత్రంగా గమనిస్తూ. వాడి మాటకి వాళ్ళందరూ మొఖాలు చూసుకున్నారు.

"మాది ప్రసాదన్న దళం తమ్మీ... కొమురన్న, మేమూ ఒక్కటే. మాది నల్గొండ జిల్లా, ఈ గుట్టల్లల్ల మా అందరి మీటింగుంది. గందుకోసమచ్చినం" అన్నాడు వాళ్ల నాయకుడు.

"సరేగని... గిప్పుడు గాపాట పాడిందెవల్లు. గాపాట కొమురన్న దళంలో భాస్కరన్న మస్తుగా పాడతాడు. నేను గాళ్లేననుకొని ఉరికొచ్చిన". అన్నాడు వాడు సన్నిహితంగా.

"నేనే తమ్మి... నా పాట గంతనచ్చిందా ? ఇంకోసారి పాడన్నా..." అంటూ పాడిన వ్యక్తి రెండు చరణాలు పాడి విన్పించాడు. సమ్మిగాడి మొహం వెలిగిపోయింది.

"తమ్మీ... ఆకలి బాగయితంది. మా కోసం అన్నందెత్తవా ?"అనడిగాడు నాయకుడు. "గిప్పుడా... వూర్లెకి పోయచ్చేసరికే గంటైతది. గప్పటిదాకా ఆకల్ని ఓర్చుకుంటరా మరి ? కొమురన్ననైతే ఒకరోజు ముందుగనే చెప్పంపుతాడు. మా అవ్వండితే నేనే దీస్కత్త గీ గుట్టల్లల్లకు" చెప్పాడు. వాడి కళ్లలోని అమాయకత్వం వాళ్లని ముగ్ధుల్ని చేసింది.

"గంతదాకా గీ జామకాయలు తింటం తమ్మీ... నువ్వు గీ పెద్దన్నకు జెల్దిన అన్నం పట్టుకురావాలె" అన్నాడాకాయన.

"గట్లనే గనీ... మీరు గిక్కన్నే వుంటరా...కొమురన్న కాడికి పోతరా ?" అనడిగాడు.

"నువ్వు సద్దిదెచ్చేదాకా గిక్కన్నే వుంటం తమ్మీ... జెల్ది తెస్తవా మరె" అన్నాడు మరో వ్యక్తి.

"ఓ...గంటలదెత్త. వుండుండ్రి మరి" అని జారిపోతున్న నిక్కరు జరుపుకుంటూ కారుతున్న చీమిడిని బర్రున లోపలికి పీల్చుకుంటూ లేచాడు సమ్మిగాడు.

"తమ్మీ... మరె పైసల్ దీస్కపో..." ఇందాకటి పెద్దాయన జేబులోంచి యాభై నోటు తీసాడు. సమ్మిగాడి ముఖం నల్లగా మారిపోయింది.

"గదేందన్నా... పైసలియ్యవద్దివి. కొమురన్న దోస్తులని సద్ది దెత్తనన్నగనీ... నేనేమన్నా

హోటల్ పెట్టిన్నా... పైసల్ దీస్కోవడానికి...." వాడి చిరుకోపానికి నవ్వొచ్చినా వాళ్లు ఆపుకున్నారు.

'గట్లంటవేం తమ్మీ... నువ్వు సద్దిదెచ్చినప్పుడల్లా కొమురన్న పైసలియ్యడా ఏంది?' అన్నాడు.

"ఛత్... మా పెద్దయ్య, చిన్నయ్య గొర్ల పంపకాలల్ల మస్తు కొట్లాడుకున్రు. మా చిన్నయిన్న అన్నని గూడా సూడకుంట మా అయ్యని కొట్టిండు. గప్పుడు ఎట్లతెల్సిందో ఏమో... గా కొమురన్న దళమచ్చి పంచాయితి తెంపిండ్రు. మా గొర్లు మా కొచ్చినయ్. గప్పట్నించి ఎప్పుడన్నా మేమే సద్దిపెడ్తం" చెప్పాడు సమ్మిగాడు. "సరే... పైసలద్దంటవ్ గని... ఆకలి బాగయితంది తమ్మి... జెల్దిపోరాదు" అన్నాడు పెద్దాయన.

"అద్దగంటల తెస్తజాడు" అనుకుంటూ సమ్మిగాడు చెట్లమధ్యలోంచి పరిగెత్తాడు. వాళ్లు నక్సల్స్ వేటకోసం మఫ్టీలో వచ్చిన పోలీసులని తెలీని సమ్మిగాడు సద్దిదేవడానికి మేకపిల్లలా పరిగెత్తుకెళ్లాడు. వాడు వెళ్లగానే దళనాయకుడిలా మాట్లాడిన సర్కిల్ ఇన్స్పెక్టర్ వైపు విస్మయంగా చూసారు ఎస్సయ్. మిగితా పోలీసులు.

వాడు కనుమరుగుకాగానే... "మీరేం మాట్లాడకండి నేనన్నీ లాగుతాను" అన్నాడు సి.ఐ. గంభీరంగా మరో సిగరెట్ ముట్టిస్తూ.

★ ★ ★

అరగంటలో చద్దిగిన్నె పట్టుకొని ఎగపోసుకుంటూ పరిగెత్తుకొచ్చాడు సమ్మిగాడు. వాడి కాళ్లు చేతులు గీసుకుపోయి గాట్లుపెట్టినట్లు రక్తం గడ్డకట్టింది.

" మా అవ్వ కైకిలిపోయింది. పొయ్యిమీది గిన్నెల గిదేవుంది. కొమురన్న దోస్తువని జెల్ది తీసుకచ్చిన" అన్నాడు వాడు చద్దిగిన్నె తెరుస్తూ.

"మంచోనివి తమ్మీ... మరి గిదేంది ?" అన్నాడు సి.ఐ.

"కారంతొక్కు మస్తుగుంటది. కొమురన్న దాంతోనే మంచిగ తింటడు."

సి.ఐ.కి దాన్ని చూడగానే మంట నసాలానికి తాకింది. అయినా అన్నం, కారం తొక్కు కలిపి ముద్దనోట్లో పెట్టుకున్నాడు. మంటని ఓర్చుకుంటూనే.

"నీ పేరేంది తమ్మి ?"

"మైసయ్య... అందరూ మైసిగాడు అంటరు. మా గొర్రెల్ని మాకిప్పిచ్చిండు కొమురన్న గాయిన కూడా మైసిగా" అనే అంటడు.

"తమ్మీ... కొమురన్న దగ్గరికి మీటింగ్ కెళ్తున్నం. గీ గుట్టల్లల్ల దారే తెల్తలేదు. మాది నల్గొండనాయె. కొమురన్న దగ్గరికి ఎట్లపోవాలె జెరంత జెప్పు" అన్నాడు.

మైసిగాడు వెంటనే చెప్పలేకపోయాడు. వాడిలో ఏదో అనుమానం మెదిలింది. "ఏంది తమ్మీ... కొమురన్న మా కోసం ఎదిరిసూత్తడు. గీ అన్నలేంది మంచిమంచి పాలిస్టర్ బట్టలేసుకున్నరు అనుకుంటున్నావా. మేం మా జిల్లాల అడవుల్నించి బస్సులో వరంగల్ దాక వత్తిమి. అక్కన్నించి ఓ జీపు మాట్లాడుకొని గీ రామగిరి గుట్టలదాకా వత్తిమి. కొమురన్న లెక్క గ్రీన్ బట్టలేసుకోనత్తే పోలీసోల్లు చంపరా... రేపు మీటింగ్‌ల అందరం గవ్వే బట్టలేసు కుంటం" అని చెప్పాడు సి.ఐ.

సమ్మిగాడికి ఆ మాట నిజమేనన్పించింది.

"సారక్క సమ్మక్క మీద ఒట్టు తమ్మీ... గీ గుట్టల్లల్ల మాకు దారి తెల్తలేదు". అన్నాడు దీనమైన మొహం పెట్టి ఎస్సయ్.

"పోనీ నువ్వు దీస్కెల్లరాదు" అన్నాడు సి.ఐ.

"అబ్బో... గీ సీకటిపడంగ నేనత్తే నా గొర్లు తప్పిపోతే మా అయ్య సంపుతాడు. గందుకని గిట్లనే సక్కగా పొంద్రి... పోంగ పోంగ మైసమ్మ బండత్తది. గక్కన్నుంచి ఎడమదిక్కు తిరిగితే ఇప్పచెట్టుంటది. మల్లగాన్నుంచి సక్కగపోతే ఎనుకటి బురుజుంటది. బురుజులోపలి కెళ్లిపోతే చిమ్మని చీకటుంటది. దాంట్లకెళ్లి లోపలికి వోతె కొమురన్నుంటడు" గైడ్‌లా చెప్పాడు వాడు.

"గట్లనే రమ్మని కొమురన్న గూడ సెప్పిండు తమ్మీ, మా మీటింగ్ కూడా గక్కన్నే. కాని అడవి దట్టంగుందాయె తొవ్వ దొరుకతలేదు." అన్నాడు చద్దన్నాన్ని బలవంతంగా తిని సి.ఐ.

సమ్మిగాడు నిర్మలంగా నవ్వాడు. ఆ నవ్వు మీరేం అన్నలన్నట్టుంది.

"సరే తియ్...గిప్పుడే అంటే రాను గనీ... పొద్దుగాలయితే గొర్లని పడమటి పక్కకి కొట్టి... మిమ్మల్ని కొమురన్న దగ్గరికి తోలేసత్త" అన్నాడు.

"మంచిది తమ్మీ... నువ్వచ్చేదాకా గిక్కన్నే వుంటం మరి" అన్నాడు సి.ఐ.

"సరె తియ్... మరి నా గొర్లువోతయ్... పోతన్న మరె" అనుకుంటూ నిక్కరు పైకెగదోసుకుంటూ పరిగెత్తాడు వాడు.

తర్వాత... సి.ఐ. కూంబింగ్ ఆపరేషన్‌కి సిద్ధం చేసాడు. మరో రెండు బలగాల

కోసం వైర్‌లెస్ మెసేజ్ పోయింది.

* * *

తెలతెలవారుతుంటే...

మైసిగాడు వాళ్లని దాదాపు అయిదు కిలోమీటర్లు తీసికెళ్లాడు. అప్పటికే మరో రెండు దిక్కుల్నించి రెండు ట్రూపులు గుట్టకిందినించి వస్తున్నాయి. ఇప్పచెట్టు దగ్గర అలికిడి విని దళం మేల్కొంది. బురుజు దగ్గరున్న సెంట్రీ అరవటంతో... ఒక్కసారిగా కాల్పులు మొదలయ్యాయి. మైసిగాడు కుందేలు పిల్లలా బెదిరిపోయాడు. సి.ఐ. అరుపుల్తో వాళ్లు పోలీసోల్లని అర్థమైంది.

క్షణాల్లో... అడవి దద్దరిల్లేలా కాల్పులు. మైసిగాడు భయంగా ఏడుస్తూ చెట్లల్లోకి పరిగెత్తాడు.

నిర్విరామంగా రెండున్నర గంటలసేపు... అడవి వణికిపోయింది. గండుచీమలు సైతం చెట్ల తొర్రల్లోంచి బయటికి రాలేనంత భయంకరమైన కాల్పులు జరిగాయి.

ఆ తర్వాత క్రమంగా నిశ్శబ్దం...

గంట...

రెండు గంటలు...

పోలీసులు మెల్లిగా చెట్ల మధ్య గాలించటం మొదలెట్టారు.... ఎవరూ కన్పించలేదు... చాలా సేపు గాలించాక...

'దళం తప్పించుకుంది'

సి.ఐ. కోపంగా, అసహనంగా అన్నాడు. అప్పుడే దూరంనించి ఓ కానిస్టేబుల్ "సార్... ఇక్కడో శవముంది" అని అరిచాడు. అంతా అలర్ట్‌గా పరిగెత్తారు.

అక్కడ...

నిర్జీవంగా...

మైసిగాడి శవం !

ఉలిక్కిపడ్డారంతా !! వాడి ఛాతిలోంచి నక్సలైట్ల బుల్లెట్ దూసుకెళ్లింది.

చద్దన్నం సాక్షిగా మైసిగాడు చచ్చిపోయాడు.

బిక్కచచ్చిపోతున్న తెలంగాణా పల్లెలాగ !!

వాడికే సిద్ధాంతమూ తెలీదు... వీళ్ల రాద్ధాంతాలు వాడెపుడూ చదవలేదు.

వాడికి కరవుదాడులు తెలీదు... కూంబింగ్ ఆపరేషన్లు అంతకన్నా తెలీదు...

అయినా...

మర్నాడు పత్రికల్లో వాడు పతాకమై వెలిసాడు. ఎవరికి తోచినట్లు వాళ్లు రాసారు.

'పిల్లలనే కొరియర్ వ్యవస్థగా ఏర్పాటు చేసుకొన్న తీవ్రవాదులు' - ఒక దినపత్రిక

'పిల్లల ద్వారా నక్సల్స్ ఆచూకీ కోసం ప్లాన్ కనిపెట్టిన పోలీసులు' - మరో దినపత్రిక

'ఎల్‌టిటిఇ మార్గంలో పిల్లలకి తర్ఫీదునిస్తున్న ఉగ్రవాదులు' - ఇంకో దినపత్రిక

వార్తల వాళ్లు వార్తలు రాసుకున్నారు.

కవులు కవితలు రాసారు... ప్రచండ బాలుడు అని...

బురదలో జాబిల్లి అని...

బాయ్‌నెట్‌పై మొలకెత్తిన గోపాలుడని...

రాలిపోయిన అడవిమల్లె అని....

ఖాకీవనంలో ప్రమోషన్లు తీసుకునే వాళ్లకి... కలం దులిపి అక్షరాలు అమ్ముకునే వాళ్ళకి కూడా వాడు చావుతో చద్దన్నం తెచ్చిపెట్టాడు.

ఆకలి తెల్సినోడు కాబట్టి !

అంతరంగాలు తెలియనోడు కాబట్టి....!!!